క్లుప్తంగా

క్రికెట్ విజేత మందమర్రి జట్టు



క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న స్వామి

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏఎంసీ క్రీడా మైదానంలో నిర్వహించిన హరీష్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్ మందమర్రి విరాట్, బెల్లంపల్లి స్పార్కర్స్ జట్ల మధ్య జరిగింది. హోరాహోరిగా జరిగిన క్రికెట్ పోటీల్లో మందమర్రి విరాట్ జట్టు విన్నర్స్‌గా నిలవగా, బెల్లంపల్లి స్పార్కర్స్ జట్టు రన్నర్స్‌గా సరిపెట్టుకుంది. విజేతలుగా నిలిచిన ఇరు జట్లకు బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు నాతరి స్వామి ట్రోఫీని అందజేశారు. నువ్వానేనా అని గెలుపు కోసం తలపడిన ఇరుజట్ల క్రీడాకారులను స్వామి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ ముందు మరో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడా పోటీల్లోనూ రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా బహుమతులను స్పాన్సర్ చేసిన మురుకూరి బాలాజీని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు ఖలీల్, బాలు, వెంకటస్వామి, శ్రీను, సదానందం, న్యాయవాది రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయాలసిస్ సెంటర్ ప్రారంభం

చెన్నూర్: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్‌ను బుధవారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రారంభించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ తెలిపారు. డయాలసిస్ సెంటర్ ప్రారంభంతో ఈ ప్రాంత కిడ్నీ రోగులకు మేలు చేకూరుతుందని తెలిపారు.

తెలంగాణ రజక సంఘం మండల కమిటీ ఎన్నిక



సంఘాన్ని ఎన్నుకుంటున్న సభ్యులు

భీమిని: తెలంగాణ రజక సంఘం భీమిని మండల నూతన కమిటీని మంగళవారం జిల్లా అధ్యక్షుడు తంగళ్లపల్లి బాపు, ఉపాధ్యక్షులు బాగాల రాజన్న, సారయ్య ఆధ్వర్యంలో భీమిని రజక కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రాజన్న, ఉపాధ్యక్షులుగా ముత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా జనగామ మల్లేష్, ప్రచార కార్యదర్శిగా రాజయ్య, కోశాధికారిగా ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బాపు మాట్లాడుతూ.. రజకులందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాటాలు చేస్తూనే హక్కులు సాధ్యమవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రజకుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కుమారస్వామి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం.. ప్రమాదకరం

దండేపల్లి: మండలంలోని ఎల్లయ్యపల్లెలో గల శ్రీ పోచమ్మ ఆలయ సమీపంలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. స్తంభం వంగి గుడిపై ఒరిగింది. దీంతో ఆలయం వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు విద్యుత్‌స్తంభం అడ్డుగా మారింది. విద్యుత్‌స్తంభాన్ని ఆలయం దగ్గర నుంచి తొలగించి, దూరంలో వేయాలని స్థానికులు విద్యుత్ అధికా రుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొన్నారు.



ప్రమాదకరంగా మూలమలుపులు



కుందారం ఎక్స్‌రోడ్డు వద్దగల మూలమలుపు



పోలంపల్లి సమీపంలోని మాంతమ్మ వద్ద గల మూలమలుపు

భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై భీమారం మండలం పోలంపల్లి సమీపంలో రెండు చోట్ల ప్రమాదకరమైన మూలమలుపులు ఉన్నా అధికారులు మాత్రం నిమ్మకి నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో సింగిల్ రోడ్డు ఉన్న సమయంలో నిర్మించిన రోడ్డు 30ఏళ్ల క్రితం జాతీయరహదారిగా మార్పు చేశారు. అయితే రోడ్డు జాతీయ రహదారుల శాఖ పరిధిలోకి వెళ్లిన అనంతరం రెండు వరసల రహదారిగా అభివృద్ధి చేశారు. అతి ప్రమాదకరంగా ఉన్న చోట్ల రోడ్డును నేరుగా వేయకుండానే నిర్మించారు. దీంతో గత ఆరు సంవత్సరాల క్రితం ఆరెపల్లి గ్రామానికి చెందిన ఏడుగురు ఆటోలో వెళ్తుండగా మాంతమ్మ మూలమలుపు వద్ద టిప్పర్ వచ్చి ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఇవే కాకుండా అనేక ప్రమాదాలు సంబవించి పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. మాంతమ్మ వద్ద మూలమలుపులు సరిచేసి నేరుగా రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామని అప్పట్లో అధికారులు ప్రకటించారు. అయినా ఇప్పటివరకు అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైన రెండుచోట్ల గల మూల మలుపులు తొలగించి, నేరుగా రోడ్డు నిర్మించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.



బైపాస్ రోడ్డు పక్కన వేసిన చెత్త

చెత్త తొలగించండి..!

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని పలు రోడ్ల పక్కనా చెత్త కుప్పలను రోజుల తరబడి వేసి ఉంచడంతో ఆ ప్రాంతం అంతా దుర్వాసన వెదజల్లుతోంది. బైపాస్ రోడ్డులో అక్కడక్కడా చెత్త నిల్వ చేస్తుండగా, డీఎఫ్‌వో కార్యాలయం వెనకాల ఉన్న ప్రహరీని ఆనుకుని చెత్త కుప్పలు వేస్తున్నారు. డంపింగ్ యార్డుకు తరలించాల్సిన చెత్తను ఇలా రోడ్ల పక్కన వేయడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. చెత్తను వెంట వెంటనే తొలగించేలా చూడాలని కోరుతున్నారు.



డీఎఫ్‌వో కార్యాలయం వెనుక చెత్త

ప్రకృతి వనంలో మొక్కలెక్కడా..?



జన్నారం: గ్రామాల్లో మొక్కలు నాటి స్వచ్ఛమైన ఆక్సిజన్ ఇవ్వడమే కాకుండా ఉదయం నడకకు అనువుగా ఉండాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రతి గ్రామంలో పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేసింది. ఇందుకు వనం చుట్టూ కంచె ఏర్పాటు చేసి మొక్కలు విరివిగా నాటాలని, నీటిని పడుతూ నిర్వహణ చూసుకోవాలని ఆదేశిస్తూ ఇందుకు నిధులు కూడా మంజూరు చేసింది. కానీ జన్నారం మండలం కవ్వాల్ గ్రామంలో విడుదలైన నిధులు బూడిదలో పోసిన పన్నీరుల మారింది. మూడు సంవత్సరాల క్రితం ఈజీఎస్ పనుల ద్వారా పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేశారు. ప్రకృతి వనంలో ఈజీఎస్ కింద 1000మొక్కలు నాటారు. చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటికీ ఒక్క మొక్క కూడా పెద్దది అయిన దాఖాలాలు లేవు. నిర్వహణ లోపమా.. లేక భూమి లోపమా తెలియదు కానీ, నేటికి ఆకులు రాలిన, మోడివారిన మొక్కలు కనిపిస్తున్నాయి. ఈ విషయంలో పంచాయతీ సిబ్బంది కానీ, మండల పరిషత్ అధికారులు గానీ దృష్టి సారించినట్లు కనిపించడం లేదు. జిల్లా అధికారులు దృష్టి సారించి, కవ్వాల్‌లో పల్లె ప్రకృతివనం ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీవో రమేశ్‌ను 'సాక్షి' సంప్రదించగా వర్షకాలంలో నీరు రావడం వల్ల మొక్కలు ఎదుగుదల ఆగిందని, కేవలం రెండు రకాల మొక్కలే పెరుగుతున్నాయని తెలిపారు.



మోడువారిన మొక్కలతో దర్శనమిస్తున్న పల్లెప్రకృతివనం

అధ్వానంగా మురుగు కాలువలు



ఆస్నాదలో రాపల్లి వాడకు వెళ్లే దారిలో...



ఆస్నాదలో సర్తాపు వాడకు వెళ్లే దారిలో...

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలో సరైన మురికి కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రాపల్లి వాడ, సర్తాపు వాడలతో పాటు ఇతర కాలనీలలో సరైన మురికి కాలువలు లేక పోవడంతో మురికి నీరంతా రోడ్డు పైనే పారుతుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపైన నడవలేని పరిస్థితి నెలకొంటుంది. సంబంధిత అధికారులు పట్టించుకొని మురికి కాలువల నుండి నీరు రోడ్ల పైకి రాకుండా చూడాలని, మురికి కాలువలు లేని చోట మురికి కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక గది ఏర్పాటు

చెన్నూర్: కరోనా కేసులు పెరుగుతుండడంతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కరోనా నియంత్రణలో భాగంగా చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక గదిని ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ తెలిపారు.



మట్టితో గుంతలు పూడ్చి నిరసన..!



గుంతలు పూడ్చుతున్న నాయకులు

కాసిపేట: మండలంలోని సోమగూడెం నుంచి కాసిపేట గని వరకు రోడ్డుపై తీవ్ర గుంతలతో ఇబ్బంది పడుతున్నామని, వెంటనే సమస్య పరిష్కరించాలని మంగళవారం తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకుడు గోనెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మట్టితో గుంతలు పూడ్చి నిరసన తెలిపారు. రోడ్డుపై ఓరియంట్ కంపెనీ, సింగరేణి భారీ వాహనాలు తిరుగుతుండటంతో గుంతలు ఏర్పడుతున్నాయని, దీంతో ఆ రోడ్డుపై వెళ్లాలంటే కార్మికులు నానా అవస్థలు పడుతున్నట్లు వాపోయారు. వెంటనే ప్రజాప్రతినిధులు స్పందించి సింగరేణి, ఓరియంట్ యాజమాన్యాల ద్వారా కానీ, ప్రభుత్వం ద్వారానైనా రోడ్డు పునర్నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకుడు దాసరి రాంచందర్, కాంగ్రెస్ నాయకుడు దుర్గం గోపాల్, కారుకూరి లక్ష్మణ్, బొడ్డు శంకర్, ఆటోయూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ వేడుకలు



బెల్లంపల్లిరూరల్: వేడుకల్లో సీపీఐ శ్రేణులు



చెన్నూర్ సీపీఐ కార్యాలయంలో...

బెల్లంపల్లిరూరల్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భావ వేడుకలను మంగళవారం బెల్లంపల్లి మండలంలోని అంకుశం, రంగపేట గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ ఎర్రజెండా ఎగురవేసి, ప్రజా ఉద్యమాల్లో అసువులు బాసిన అమరులకు విప్లవ జోహార్లు అర్పించారు. అమర వీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో సీపీఐ పార్టీ నిత్యం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు రాజేశం, నాయకులు శంకర్ గౌడ్, కుమార్, హన్మంతు, తిరుపతి, వెంకటేష్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి నెన్నల సమ్మయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుంకరి చందు, జాడి సమ్మయ్య, నెన్నల సతీశ్, కిష్టయ్య, రంజిత్, సంజయ్, ఎల్లయ్య, శంకర్, రాజయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం సీపీఐ పార్టీ ఆవిర్భావ వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ హాజరై కేక్ కట్ చేసి పార్టీ జెండా ఆవిష్కరించారు. పాలక ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పార్టీ ప్రజల పక్షాన నిలిచి పోరాడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, లింగం రవి, జిల్లా సమితి సభ్యులు దేవి పోచన్న, పోల్, దుర్గరాజ్, శంకరయ్య, మిర్యాల రాజేశ్వరరావు ఉన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్

కళాజాత ప్రదర్శన



పాటలు పాడుతున్న కళాకారులు

భీమారం: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించేందుకు మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని పద్మశాలీ వీధిలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజవర్ధన్ మాట్లాడుతూ.. ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాలను తొలగించేందుకు పోలీస్‌శాఖలోని కళాకారులతో ప్రదర్శనలు ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మంత్రాల పేరుతో అనేక కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయన్నారు. కళాకారుల ఇన్‌చార్జి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పోలీసులు 24గంటల పాటు ప్రజలకు సేవలు చేస్తూనే, మరోపక్క ప్రజలకు అర్థం అయ్యేలా పాటలు, నాటికల రూపంలో ప్రదర్శనలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు మూఢనమ్మకాలకు దూరంగా ఉండి వారి పిల్లలను చదివించాలని కోరారు. ఇందులో సర్పంచ్ గద్దె రాంరెడ్డి, వార్డు మెంబర్ గుడిమల్ల నరహరి పాల్గొన్నారు.

చపరాడ పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: ఈ నెల 29వ తేదీన ఉదయం 4:30గంటలకు మంచిర్యాలలోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం, కాగజ్‌నగర్ మీదుగా మహారాష్ట్రలోని చపరాడకు పాదయాత్ర చేపట్టే పోస్టర్లను మంగళవారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాదయా త్ర చేసే భక్తులు 29వ తేదీన మంచిర్యాల నుంచి ఉదయం బయలుదేరి మైలారం, ఘనపురం, రేచిని, బొగుడపల్లి, కాగజ్‌నగర్ మీదుగా చపరాడ చేరుకుంటుందని, 29వ తేదీ రాత్రి రెబ్బెన, 30వ తేదీ రాత్రి టోంకిని హనుమాన్ మందిర్, 31వ తేదీన చపరాడాలో బస చేయాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కార్తిక్ మహారాజ్ సేవా సమితి సభ్యులు తాండూరు రామన్న, పూదరి ప్రభాకర్, రౌతు రవి కుమార్, కందికట్ల రమేశ్, టీపీసీసీ అధికార ప్రతినిధి చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, వడ్డే రాజమౌళి, జగన్మోహన్‌రావు, పత్తి తిరుపతి పాల్గొన్నారు.



ఆరట్టులో అయ్యప్ప స్వాములు

ఘనంగా ఆరట్టు

మంచిర్యాలఅర్బన్: పట్టణంలో మంగళవారం అయ్యప్పస్వామి ఆరట్టు కనుల పండువగా జరిగింది. అయ్యప్పస్వామి దేవాలయం నుంచి ప్రత్యేక వాహనంలో స్వామిని ప్రధాన వీధుల మీదుగా గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. నదిలో అయ్యప్పస్వామి విగ్రహాలకు చక్రస్నానం చేయించి ఆలయానికి తీసుకొచ్చారు. అయ్యప్ప దీక్ష పరుల నృత్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

చెన్నూర్‌లో దత్త జయంతి

చెన్నూర్: పట్టణంలోని షిరిడి సాయిబాబా ఆలయంలో దత్త జయంతి సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఓంకార్ శర్మ ఆధ్వర్యంలో జయంతిని కనుల పండువగా నిర్వహించారు. రాత్రి భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

ముగిసిన గురు చరిత్ర పారాయణం

చెన్నూర్ పట్టణంలోని శివాలయంలో లోక కళ్యాణార్థం దత్త జయంతిని పురస్కరించుకొని గత బుధవారం ప్రారంభమైన గురుచరిత్ర పారాయణం మంగళవారం ముగిసిందని అర్చకులు మహేశ్వర్‌శర్మ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్ర

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో తాండూర్ మండలం నుంచి మాదారం చేరిన అక్షింతలను మంగళవారం పోచమ్మ గుడి వద్ద పల్లకిలో ఉంచి కోదండ రామాలయం పూజారి ముద్దు అవధూత శర్మ వేద మంత్రోచ్చరణలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రామాలయానికి చేరిన అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆధ్యాత్మికం

గూడెంలో పౌర్ణమి జాతర



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు

దండేపల్లి: మంచిర్యాల జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన దండేపల్లి మండలం గూడెం శ్రీ స త్య నారాయణస్వామి ఆలయంలో మంగళవారం మార్గశిర పౌర్ణమి జాతర ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. సుమారు 169జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో గూడెం ఆలయ ప్రాంగణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.

హనుమాన్ ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

జన్నారం: మండలంలోని ఇందన్‌పల్లి గ్రామ హనుమాన్ ఆలయంలో మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. ఎన్నికల సమయంలో కార్యకర్తలు ఎమ్మెల్యేగా గెలిపించాల ని మొక్కుకోగా, ఆ మొక్కును తీర్చుకున్నా రు. అనంతరం ఇందన్‌పల్లిలో కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. ఏ సమస్య అయినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని, కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకుంటానని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, శుభాష్ రెడ్డి, సయ్యద్ ఇషాక్, సుధాకర్, వెంకటరా జం, కరుణాకర్, నందు నాయక్, ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీవో హరికృష్ణ

బెల్లంపల్లి: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌లో విజయవంతం చేయాలని ఆర్డీవో హరికృష్ణ తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన గ్రామసభలు, వార్డు సభల నిర్వహణపై ప్రభుత్వశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ఈ నెల 28తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన గ్రామ సభలు జరుగుతాయన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని గ్రామపంచాయతీలు, బెల్లంపల్లి మున్సిపాలిటీలో సభలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గ్రామ, వార్డుసభలను ప్రతిరోజు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, ఆ తర్వాత మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విడతల వారీగా నిర్వహించాలని ప్రభుత్వం సూచించినట్లు పేర్కొన్నారు. ఉదయం ఓ వార్డు ,గ్రామపంచాయతీ, మధ్యాహ్నం మరో వార్డు, గ్రామ పంచాయతీలో సభలు జరిపి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని వివరించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను విధిగా ఆన్‌లైన్ చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని, జవాబుదారిగా వ్యవహరించాలని ఆయన కోరారు. సమావేశంలో బెల్లంపల్లి డివిజన్ పంచాయతీ అధికారి ఫణీందర్‌రావు, మున్సిపల్ కమిషనర్ ఆర్.భుజంగరావు, రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు ,పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.